క్లుప్తంగా

ప్రతిష్టాత్మకంగా గణేశ్ ఉత్సవాలు



నెల్లూరు(బృందావనం): బెజవాడ గోపాల్‌రెడ్డి కూడలి లంబోదర సెంటర్‌లో ఈ ఏడాది వినాయక చవితి మహోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తెలిపారు. మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్థానిక లంబోదర సెంటర్‌లో శనివారం సాయంత్రం ఆవిష్కరించి, మాట్లాడారు. ఆగస్టు 27 నుంచి 31 వరకు ఉత్సవాలు ఉంటాయన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణం

• ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన నగర పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వ అక్రమ అరెస్టులపై శనివారం రాత్రి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తూ రెడ్‌బుక్ పాలన సాగిస్తోందని, రానున్న రోజుల్లో ప్రజలు వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు.

అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్.మహబూబ్‌బాషా నియమితులైన సందర్భంగా నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం అభినందించారు. ఈ మేరకు చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన నివాసంలో మహబూబ్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు.

పరామర్శ



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ రూరల్ మండల ఉపాధ్యక్షుడు దొడ్ల మస్తానయ్య తల్లి లక్ష్మమ్మ ఆకస్మికంగా మృతిచెందారు. ఈ సందర్భంగా రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శనివారం మస్తానయ్య నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నగరంలో దొంగల హల్‌చల్

• మూడిళ్లల్లో చోరీలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో శనివారం పట్టపగలు దొంగలు హల్‌చల్ చేశారు. చిన్నబజారు, వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మూడు ఇళ్లల్లో రూ.లక్షల విలువచేసే సొత్తును దోచుకెళ్లారు. ప్రాథమిక సమాచారం మేరకు.. సాయినగర్‌లో ఉమాకాంత్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఆయన టీస్టాల్‌లో పని చేస్తుండగా, భార్య బ్యూటీషియన్. ఇద్దరూ శనివారం పనులకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని మూడున్నర సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. రాత్రి బాధితులు ఇంటికి రాగా తలుపులు తెరచి ఉండటం, బీరువాలోని ఆభరణాలు కనిపించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

⇨ మనుమసిద్ధినగర్‌లో సోమశ్వరి కుటుంబం నివాసం ఉంటోంది. వారు శనివారం ఒంగోలులో బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు ఆమె ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు 20 సవర్లకు పైగా బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. రాత్రి ఒంగోలు నుంచి ఇంటికి చేరుకున్న బాధితులు చోరీ ఘటనపై చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

⇨ తెలుగుగంగ కార్యాలయ సమీపంలోని నిర్మలానగర్‌లో పిచ్చయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. వారిద్దరూ ఉపాధ్యాయులు. వారు శనివారం విధులకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని సుమారు 30 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చిన దంపతులు చోరీ జరిగినట్లు గుర్తించి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు ఘటనా స్థలాల్లో క్లూస్‌టీమ్ వేలిముద్రలను సేకరిస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

‘స్వచ్ఛ నెల్లూరు’ సాకారానికి కృషి

• కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): ‘స్వచ్ఛ నెల్లూరు’ సాకారానికి సమష్టిగా కృషి చేద్దామని కమిషనర్ నందన్ పిలుపునిచ్చారు. ‘స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర’ కార్యక్రమ నిర్వహణలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ‘ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్’ అంశంపై కొత్త కాలువ సెంటర్, డీజీపీ కల్యాణ మండపం, బీవీఎస్ హైస్కూల్ సెంటర్, అన్నమయ్య సర్కిల్, అయ్యప్ప గుడి, డైకస్ రోడ్డు గౌతమ్‌రెడ్డి విగ్రహం కూడలి, ఈఎస్ఆర్ఎం స్కూల్, మహబూబ్ ఖాన్ పార్క్, నర్తకి సెంటర్, పీఎంఆర్ స్కూల్, సంతపేట రోడ్డు, జనార్దన్‌రెడ్డి కాలనీ కూడలి ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. చిల్డ్రన్స్ పార్క్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అధికారులతో కలిసి కమిషనర్ పాల్గొని స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం మాట్లాడుతూ ఒకసారి వాడి పడేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి జరుగుతున్న హాని గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా జౌళి, నార గుడ్డ సంచులను వినియోగించాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయవిక్రయాలు, రవాణా, నిల్వ తదితర అంశాలపై కఠిన చర్యలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ శేషగిరిరావు, హార్టికల్చర్ ఏడీ నరసింహారావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, మెప్మా పీడీ లీలారాణి, సచివాలయ కార్యదర్శులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడకూడదంటూ అవగాహన కల్పిస్తున్న కమిషనర్ నందన్

⇨ నెల్లూరురూరల్: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని డీఆర్వో హుస్సేన్‌సాహెబ్ అన్నారు. స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ గుడ్డ సంచులు వినియోగించాలని సూచించారు. కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

⇨ నెల్లూరు(అర్బన్): పరిసరాల పరిశుభ్రతతో అనేక వ్యాధులను దూరం చేయవచ్చని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మెడికల్ కళాశాల, పెద్దాస్పత్రి ఆవరణలో ఉన్న చెత్తను డాక్టర్లు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది శనివారం తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను తొలగించడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, గ్లాసులు, ప్లేట్లను వినియోగించరాదన్నారు. అనంతరం డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా సిబ్బందితో స్వచ్ఛాంధ్ర సాధన కోసం పని చేస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి కళారాణి, డాక్టర్ గంగాధర్, పలువురు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

⇨ నెల్లూరు (పొగతోట): జెడ్పీ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొని, మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం ప్రస్తుతం తీవ్రమైన సమస్యగా మారిపోయిందని తెలిపారు. ఈ క్రమంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. దీనిపై కాలేజీలు, పాఠశాలల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

⇨ నెల్లూరు(క్రైమ్): పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగింది. నగరంలోని పోలీస్ కార్యాలయం నుంచి డీకేడబ్ల్యూ కళాశాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ సహిత ఉత్పత్తుల వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిరోధించడం, కాలుష్య రహిత భూగర్భ జలాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగర, రూరల్, ఏఆర్, ట్రైనీ డీఎస్పీలు పి.సింధుప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు, చంద్రమోహన్, శివప్రియ, నగర, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు



పెద్దాస్పత్రి ఆవరణలో..



జెడ్పీ కార్యాలయంలో..



పోలీసుశాఖ ఆధ్వర్యంలో..

శాకంబరిగా దుర్గాదేవి



నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వైకుంఠపురం పెన్నానది ఒడ్డున ఉన్న కాశీనాయన ఆశ్రమంలో దుర్గాదేవికి శుక్రవారం అర్ధరాత్రి శాకంబరి అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ హిమవంత్ స్వామి ఆధ్వర్యంలో శ్రీచక్రానికి కుంకుమ పూజ, పరమేశ్వరునికి మహన్యాస రుద్రాభిషేకం జరిపారు. పెద్ద ఎత్తున భజన కార్యక్రమాలు చేపట్టారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఆశ్రమ సేవకుడు ధన్వి శ్రీనివాస్, సేవకులు వెంకటేష్, భువన, సుబ్రహ్మణ్యం, దేవసేనకుమార్, జలజ తదితరులు పర్యవేక్షించారు.

దీక్ష విరమణ

నెల్లూరు(బారకాసు): అక్రమ బదిలీ రద్దుకు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో గత తొమ్మిది రోజులుగా కావలి సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రావెళ్ల భాస్కర్ చేపట్టిన నిరసన దీక్షకు అధికారులు స్పందించారు. ఆయన్ను డిప్యుటేషన్‌పై గుంటూరు కార్పొరేషన్‌కు బదిలీ చేయడంతో శనివారం ఆయన దీక్షను విరమించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నెల్లూరు(అర్బన్): మహిళా చట్టాలు, సైబర్ క్రైమ్‌లపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు అన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగరంలోని చైతన్యపురిలో ఉన్న పద్మావతి నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులకు భౌతిక, లైంగిక దాడులు–ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ భవిష్యత్తులో జరిగే దాడులకు సంబంధించి పోక్సో యాక్ట్, శక్తియాప్, మానవ అక్రమ రవాణా అంశాలపై వివరించారు. బాల, బాలికల సంరక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తోందన్నారు. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా అమర్యాదగా, అగౌరవంగా ప్రవర్తిస్తే భయపడాల్సిన పని లేదన్నారు. తమకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి, ఎస్సై భాస్కర్‌బాబు, ఏఎస్సై శ్రీహరి, శక్తి టీమ్ సభ్యులు, నర్సింగ్ కళాశాల కరెస్పాండెంట్ ప్రసాద్‌రావు, ప్రిన్సిపల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు

బంగారు సరుడును తీసుకెళ్లి.. తాకట్టుపెట్టి..

నెల్లూరు(క్రైమ్): నమ్మకంగా ఉంటూ బంగారు సరుడును తీసుకెళ్లి తాకట్టుపెట్టిన మహిళపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మన్సూర్‌నగర్‌లో రాధా కుటుంబం నివాసం ఉంటోంది. ఈ ఏడాది మార్చిలో ఆమె వద్దకు పిన్నమ్మ కుమార్తె ఇందిర వచ్చింది. బంధువుల వివాహం ఉందని బంగారు సరుడు ఇస్తే వివాహానంతరం తిరిగి తెచ్చిస్తానని చెప్పింది. దీంతో రాధా తన మెడలోని రెండున్నర సవర్ల బంగారు సరుడును ఇచ్చింది. రోజులు గడుస్తున్నా తిరిగి ఇవ్వలేదు. పలుమార్లు అడిగినా కాలయాపన చేస్తూ వచ్చింది. దీంతో అనుమానం వచ్చి రాధా ఆరాతీయగా సరుడు తాకట్టులో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఇందిరపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు శనివారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వే పోలీసులకు ఆరోగ్య పరీక్షలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వే పోలీస్‌స్టేషన్‌లో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే పోలీసులకు బీపీ, షుగర్, ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్, సీఐ ఎ.సుధాకర్, ఎస్సై హరిచందన పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ విజయకుమార్ యాదవ్, ఎంపీడీఓ శైలేంద్రకుమార్ అన్నారు. నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధిలైట్ల మరమ్మతులు ఆలస్యం కాకుండా చూడాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో దోమల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీల్లో చెత్త చెదారాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో మండల కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలి

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ(హెచ్‌డీఎస్) కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులుగౌడ్ కోరారు. కిడ్నీ రోగుల కోసం బయ్యా సరోజనమ్మ లయన్స్ పినాకిని క్లబ్ సెంటర్ సహకారంతో నడుస్తున్న డయాలిసిస్ కేంద్రాన్ని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అక్కడి పరికరాల పనితీరు, రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవితో మాట్లాడుతూ డయాలసిస్ యూనిట్ల నిర్వహణలో నాసికరం సోడియం బైకార్బొనేట్, యాసిడ్ లాంటి ప్రాడక్ట్‌లను వినియోగిస్తున్నందున తరచూ పరికరాలు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు మొగరాల సురేష్, అబిదా సుల్తానా, దారా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమైన కలెక్టర్ ఆనంద్



పారిశుద్ధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న కలెక్టర్

నెల్లూరురూరల్: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను గౌరవించుకోవడం ఎంతో సంతోషదాయకమని, వారి సేవలు ఎనలేనివి అని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. జిల్లాలోని పంచాయతీలు, మున్సిపల్ కేంద్రాల్లో పనిచేసే 25 మంది పారిశుద్ధ్య కార్మికులతో కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ హాల్లో కలెక్టర్ శనివారం ప్రత్యేకంగా సమావేశమై, వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మొదటి వ్యక్తి పారిశుద్ధ్య కార్మికులు అని కొనియాడారు. గత ఆరు నెలలుగా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణలో ప్రధాన భూమిక పారిశుద్ధ్య కార్మికులదేనన్నారు. జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు విరివిగా బ్యాంకు రుణాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

పరికరాల కిట్ల అందజేత

గ్రామస్థాయిలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయుటకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0017ను ఏర్పాటు చేసినట్లుగా కలెక్టర్ తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి వారికి అవసరమైన రక్షణ పరికరాల కిట్‌ను అందజేశారు. అదేవిధంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తమ వంతు సేవలందించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గోను చిట్టిబాబు, గులాం షఫీఅహ్మద్, గడ్డం శశి తదితరులను సన్మానించారు.

డీఎంహెచ్‌ఓకు వినతి

నెల్లూరు(అర్బన్): గత సంవత్సర కాలంలో అనారోగ్యంతో, ప్రమాదంలో మృతిచెందిన ఆశావర్కర్లకు సంబంధించి కుటుంబ సభ్యులకు ఆశా వర్కర్లుగా అవకాశమిచ్చి ఆదుకోవాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ కోరారు. ఈమేరకు సంఘ నాయకులతో కలిసి సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాతకు శనివారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ గట్టుపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఉప్పుటూరు కమల, వెంగళరావు యూపీహెచ్‌సీలో మహేశ్వరి, బుచ్చిరెడ్డిపాళెం పనిచేస్తున్న రమణమ్మలు అనారోగ్యంతో మృతి చెందారని, అలాగే జలదంకి పీహెచ్‌సీ పరిధిలో దావులూరి లక్ష్మి యాక్సిడెంట్‌లో మృతి చెందారన్నారు. వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు వసుంధరాదేవి, కోశాధికారి మధుసూదన పాల్గొన్నారు.



పీ–4 సర్వేపై సమావేశం

నెల్లూరు(బారకాసు): స్థానిక నగరపాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డ్ అడ్మిన్ సెక్రటరీలతో పీ–4 సర్వే గురించి కమిషనర్ నందన్ అవగాహన కల్పించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కువ మంది మార్గదర్శకులు ఉండాలని తెలియజేశారు. డిప్యూటీ డైరెక్టర్ మాధురి, సెక్రటరీ శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వీపింగ్ మెషీన్ల పరిశీలన

సంతపేట, రైల్వే ఫీడర్స్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో స్వీపింగ్ మెషీన్ల పనితీరును కమిషనర్ నందన్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజాని, డీఈఈ రఘురామ్, శానిటేషన్ సిబ్బంది, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

⇨ ‘నక్ష’ సర్వే సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. హరనాథపురంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం చివరి రోజు శనివారం కమిషనర్ పాల్గొని, మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

దివ్యాంగులకు చేయూత

నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సెంటర్‌లో దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, ఇయర్ మెషీన్లు, టాయిలెట్ సెట్లు, నెక్ బ్యాండ్లను శనివారం పంపిణీ చేశారు. మదీనావాచ్ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రూప్ చైర్మన్, అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ స్టేట్ చీఫ్ జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. షోయబ్, ఉస్మాన్ సమీ తదితరులు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో గణేశ్ ఘాట్ అభివృద్ధి

నెల్లూరు(బృందావనం): రూ.80 లక్షలతో గణేశ్ ఘాట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గణేశ్ ఘాట్‌లో నిమజ్జనోత్సవ ఏర్పాట్లపై ఉత్సవ సమితి నిర్వాహకులు, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వాంగ సుందరంగా గణేశ్ ఘాట్ నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, కార్పొరేటర్ కె.విజయలక్ష్మి, ఉత్సవ సమితి నిర్వాహకులు పిట్టి సత్యనాగేశ్వరరావు, పి.సురేంద్రరెడ్డి, వంశీధర్‌రెడ్డి, బయ్యా వాసు, వేలూరు మహేష్, మండ్ల ఈశ్వరయ్య, భువనేశ్వరి ప్రసాద్, శ్రీకాంత్, మోహన్, యు.సురేష్ పాల్గొన్నారు.

పుర మందిరంలో సాహిత్య విశ్లేషణ



నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు–అష్టదిగ్గజ కవుల సాహిత్య చారిత్రక విశ్లేషణ శనివారం రాత్రి జరిగింది. ఆచార్య పాయసం సుబ్రహ్మణ్య మహర్షి పాల్గొని, శ్రీకృష్ణదేవరాయల పరిపాలన తీరు, సాహితీ సేవలను వివరించారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో నలుబోలు బలరామయ్యనాయుడు, వై.శేషగిరీశం, విశ్వనాథం, సుబ్బరాయుడు పాల్గొన్నారు.